# విజయావతారము

పాండురాజు ధర్మదేవు ననుగ్రహమున యుధిష్ఠరుని, వాయుదేవు ననుగ్రహమున భీముని, కుంతియందు కుమారులుగాబడసి సంతోషించాడు. కాని సంతృప్తి చెందలేదు. ధన మెంత సంపాదించినా ఇంకా సంపాదించాలె ననే ఉంటుంది. విద్య ఎంతచదివినా ఇంకా చదివి జ్ఞానాభివృద్ధి చేసుకుందామనే ఉంటుంది. కుమాళ్ళ నెంతమందినికన్నా, ఇంకాకందామనే ఉంటుంది. అది లోకసహజము.

పాండురాజుకు త్రిలోకవిజయుడైన కుమారుణ్ణి గని వానిమూలాన తనపేరుప్రతిష్టలు భూమిమీద చిరకాలం నిలుపుకుందామని అభిలాష తీవ్రంగా కలిగింది

పాండురాజు కుంతినిచేరబిలిచి విధ్యుక్తప్రకారము దేవేంద్రుణ్ణి పూజిస్తూ ఒకసంవత్సరంపాటు వ్రతనిష్ఠమై ఉండమని నియోగించాడు. తాను ఏకాంతాన ఒకపాదం మీదనిలబడి మానసికంగా దేవేంద్రుణ్ణిగురించి ఘోరమైన తపస్సుచేశాడు. తపస్సుకుమెచ్చి దేవేంద్రుడు ప్రత్యక్షమై ఏమికావాలెనని అడిగితే 'త్రిలోకవిజయుడైన కుమారుణ్ణి, నీఅంశాన ప్రసాదించ'మన్నాడు.'సరే. ఆలాగేప్రసాదించాను. నే చెప్పినట్లుచెయ్యి' అని ఏవో చెప్పి అంతర్హితుడైనాడు.

పాండురాజు తిరిగివచ్చి జరిగినవిషయమంతా కుంతీదేవికిచెప్పాడు. కుంతీదేవి దూర్వాసునిమంత్రంవలన ఇంద్రు నారాధించి గర్భవతియైనది.

పాండురాజు కుంతిని వెంటబెట్టుకొని అడవిలోకి వెళ్ళాడు. అక్కడ ఒకలక్ష్యాన్నిచూపించి దానికి ఏబది గజాలదూరములో ఆమెనునిలబెట్టాడు. ఒకవిల్లు, బాణము చేతికందించి ఈబాణాన్ని విల్లులోఎక్కుబెట్టి ఆ లక్ష్యాన్ని గురిచూచి కొట్టమన్నాడు. ఆమెచిన్నతనంలో తన అన్నలతోబాటు విల్లుసంధించడం నేర్చుకున్నది. ఆమె విల్లెక్కుపెట్టి తనగురి సరిచూచుకుని బాణంవదిలింది. సరిగా లక్ష్యానికి తగిలింది. సెబాష్ అని మెచ్చుకున్నాడు పాండురాజు.

లక్ష్యానికి నూరుగజాలదూరంలో నిలబెట్టి, మరోబాణం చేతికిచ్చి ఈతడవ కొట్టమన్నాడు. సరిగా లక్ష్యానికి గురితప్పకుండా తగిలింది. ఆరోజుకు సరిపెట్టి ఇంటికి వెళ్ళారు.

మరునాడు మళ్ళీవచ్చారు. క్రమేణా రెండువందలు, మూడువందలు......వెయ్యిగజాలనుంచి లక్ష్యాన్ని గురిచూచికొట్టడం సాధనచేసింది. ఆమె కిదివరకెప్పుడు తనకింతశక్తిఉన్నదని తెలియదు. సాధనచేస్తున్న కొద్ది ఉత్సాహం ఎక్కువయింది.

పదిహేనురోజు లయ్యేటప్పటికి తెల్లవారే సరికల్లా ఆమెఅంతట ఆమే 'మనము విలువిద్య సాధనచేయడానికి వెళ్ళేవేళ కాలేదా! ఇంకా ఆలాకూర్చుంటారేమి? లేవండి' అని తొందరపెట్టసాగింది పాండురాజును.

వెయ్యిగజాలకు చాలాపైగా నిలుచున్నది. లక్ష్య మెదురుగా కనబడుతున్నది. గురి సరిచూచుకున్నది. కాని అంతదూరముపోతుందా అని అధైర్యమువేసింది. ఎక్కుపెట్టినబాణాన్ని ఆకర్ణాంతం లాగివదిలింది. బాణం లక్ష్యానికితగిలి జానెడులోపలికి చొచ్చుకుపోయింది. ఆశ్చర్యపోయినాడు పాండురాజు. తనశక్తికి తాను నివ్వెరపోయింది కుంతి.

ఈ విధంగా రెండునెలలు సాధనచేసింది. తరువాత కళ్ళకు గంతకట్టుకొనేది. బాణం వింటిన ఎక్కుపెట్టి నిల్చొనేది. పాండురాజు దగ్గరలో ఏచెట్టుమీదనో చప్పుడుచేసి తొలిగినిల్చుండేవాడు. మరునిముషంలో ఆ చప్పుడుచేసినచోట బాణం గుచ్చుకుపోయిఉండేది. తర్వాత పాండురాజు దూరాన ఎక్కడనో చప్పుడు చేసేవాడు. కుంతి నారిని ఆకర్ణాంతంలాగి బాణంవదిలి చప్పుడుచేసినచోట కొట్టేది. ఈవిధంగా మరి రెండు నెలలు సాధనసాగింది.

ఇహ ఇప్పుడు కుంతీదేవికి రాత్రింబగళ్ళు విలువిద్యమీదనే ఆలోచన. రాత్రి పడుకున్నప్పుడు, ప్రొద్దున్నే విలువిద్య సాధనచేయడంలో చెయ్యవల

సిన క్రొత్తపనులేమిటనే ఆలోచనే. పగలు అదే ఆలోచనే. మనస్సును పూర్తిగా దానిమీద కేంద్రీకరించింది ఆమె.

కుంతీదేవి చిత్తస్థితిని గ్రహించాడు పాండురాజు. లోపల ఉప్పొంగిపోయినాడు. మహేంద్రుడి దయ బాగుండి తాను సఫలీకృతమనోరథుడైతే ధన్యుణ్ణను కొన్నాడు. చివర పరీక్ష నిర్వహించదలచుకున్నాడు కుంతీదేవికి.

ఒక గుబురైనచెట్టులో ఒకపచ్చిన చిలుకతలను కట్టాడు. చిలుకతల ఆకుపచ్చరంగు. చెట్టుఆకులు ఆకుపచ్చరంగు. వాటిలో చిలుకతల వేరుగా అగుపడడము లేదు. చిలుక కన్నుమాత్రము మినుకు మినుకుమంటూ మెరుస్తున్నది. కుంతీదేవికి చూపాడు. 'దాన్ని కొట్టగలవా?' అన్నాడు. ఆమె నవ్వు ఎదురులేకుండా 'ఆ' అన్నది. 'కొట్టు' అన్నాడు. చెట్టుక్రిందనుంచొని పైకిదృష్టిసారించింది. విల్లెక్కుపెట్టి గురిచూచుకొని తయారుగా నిలుచున్నది.

'గురి సరిగాచూచుకున్నావా ?'

'ఆ'

'నే నవుపడుతున్నానా ?'

'లేదు.'

'ఆచెట్టు కనపడుతున్నదా ?'

'లేదు.'

'చిలుకతల కనపడుతున్నదా ?

'లేదు.'

'మరేమి కనపడుతున్నది.'

'చిలుకకన్ను ఒక్కటి మాత్రమే.

'సరే కొట్టు.'

కన్నుమూసి కన్నుతెరిచేసరికి చిలుకతల నేలమీద పడ్డది. కన్నులోనుండా బాణందూరి ఉంది. పాండురాజు తన ఉత్సాహం పట్టలేకపోయినాడు. కుంతిని కౌగలించుకోబోయి తనశాపంమాట జ్ఞాపకంవచ్చి ఊరుకున్నాడు.

ఇంకా త్రిలోకవిజయుడైన కుమారుణ్ణి కనగల స్థితిలో కుంతి ఉన్నదో లేదో అని అనుమానము పాండురాజుకు. ఆఖరుపరీక్ష చేయదలచుకొన్నాడు.

ఒక మత్స్యయంత్రాన్ని భూమికి చాలాఎత్తున ఏర్పాటుచేశాడు. ఆయంత్రం గిర్రున ఆగకుండా తిరుగుతూ ఉంటుంది. దానికిసరిగా క్రిందఒకపళ్లెంనిండా నీళ్ళుపోసిపెట్టాడు. కుంతికి ఈ ఏర్పాట్లన్నీ చూపాడు. కుంతివెంటనే 'ఆ కొట్టకలుగుదు'నన్నది పాండురాజు చెప్పకుండానే. పాండురాజు ఆశ్చర్యపడి 'ఏమిటి? ఏలా కొడతావు?' అన్నాడు.

'ఏముంది? మీ అభిప్రాయం కనపడుతూనేఉన్నది. క్రింద నీళ్ళలోచూస్తూ పైన యంత్రాన్ని కొట్టాలె. అంతేనా ?'

తనకోర్కె సఫలంకాకుండా ఎట్లా ఉంటుందనుకున్నాడు పాండురాజు

'అవునంతే. కొట్టు' అన్నాడు.

కుంతి నీళ్ళలోచూస్తూ యంత్రంమీద దృష్టిని నిలుపుకున్నది. బాణం ఎక్కుపెట్టి లెక్కచూచుకుని బాణం వదిలింది. గిర్రున తిరుగుతున్న మత్స్యయంత్రం క్రింద పడ్డది.

నవమాసపూర్తి అయినతరువాత ఒక శుభలగ్నాన కన్నది త్రిలోకవిజయుడైన విజయుణ్ణి కుంతీదేవి.

— మొదలి సీతారామస్వామి, బి.ఏ.

మామిడిపండును గూర్చిన చాటువు

ఉ. చూతఫలావతంస! నినుఁజూచినఁ
గన్నులపండు వయ్య! లో
పాతిశయంబునన్ బరిమళాస్వాద
మయ్యె దిశౌఘమెల్ల వి
ఖ్యాతియొనర్చె నీ గుణము లైనను
గల్గదు నాకు నెమ్మదిన్
గౌతుక మొప్ప నీహృదయకర్కశ
భావము జూడఁ జూడఁగన్.